

తెలుగు భాష కీర్తిని చాటాలి

శ్రీకాకుళం అర్బన్ : తెలుగు భాష కీర్తి ప్రతిష్టలు ప్రపంచం నలుమూలలా చాటేందుకు జనవరి 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు వేదిక కావాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. తెలుగు అంతర్జాతీయ మహాసభల జిల్లా ప్రతినిధి లఖినాన రవికుమార్, సాహితీ చైతన్య కిరణాలు, బాలకథా నిలయం అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు మహాసభల ఆహ్వాన పత్రికను ఎంపీకి ఆదివారం అందజేశారు. మహాసభలు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. రవికుమార్, ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్తంగా జనవరి 5, 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలో రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రబీలోనూ కరువుఛాయలే

- సాధారణ విస్తీర్ణం 2,16,340 ఎకరాలు
- 7,645 ఎకరాల్లోనే పంటలు వేయగలిగిన రైతులు
- రిజర్వాయర్లలో అడుగంటిన నీటి నిల్వలు
- అపరాల సాగుపై తీవ్ర ప్రభావం

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల వేలాది ఎకరాల్లో రైతులు పంటలు వేయలేకపోయారు. సకాలంలో వర్షాలు కురవక వేసిన పంటలూ ఎండిపోయాయి. దీంతో రబీ పైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. రబీలోనూ అవే పరిస్థితులు నెలకొనడంతో, ఏం చేయాలో రైతులకు దిక్కు తోచడం లేదు. రబీలో వరి వేయొద్దని ఇప్పటికే అధికారులు రైతులకు సూచించారు. వర్షాలు లేకపోవడంతో వంశధారలో నామమాత్రపు ప్రవాహం ఉండగా, నాగావళి నదిలో నీటి ప్రవాహం జీరో లెవల్స్‌కు చేరింది. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో రైతులు విత్తనాలు వేయలేకపోతున్నారు. ఈ సంవత్సరం వర్షాలు లేకపోవడంతో అపరాల సాగుపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



నందిగాం ప్రాంతంలో పిల్ల కాలువలో అడుగంటిన వంశధార నీరు

రబీలో సాధారణంగా అన్నిరకాల పంటలు కలిపి మొత్తం 2,16,340 ఎకరాల్లో సాగవుతుంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 7,645 ఎకరాల (4 శాతం) మేర సాగు అయింది. వరి పంటను 21,150 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 17.5 వేల ఎకరాల్లో వేశారు. మొక్కజొన్న పంటను 38,162.5 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా 5,060 ఎకరాల్లో వేశారు. రాగులను 5,425 ఎకరాల్లో రైతులు వేస్తారని అంచనా వేయగా ప్రస్తుతం 82.5 ఎకరాల్లో వేశారు. చెరుకు పంటను 3,675 ఎకరాల్లో వేయాల్సి ఉండగా పది ఎకరాల్లో వేశారు. వేరుశనగ పంటను 10,660 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 280 ఎకరాల్లో వేశారు. నువ్వులు, పొద్దుతిరుగుడు విత్తనాలు ఒక్క ఎకరాలోనూ వేయలేదు. సాధారణంగా ఈ సీజన్‌లో నువ్వుల పంటను 13,940 ఎకరాల్లో, పొద్దుతిరుగుడు పంటను 847.5 ఎకరాల్లో వేస్తారు.

ఆరుతడి పంటలకూ నీళ్లు కష్టమే

రబీలో అధిక శాతం మంది రైతులు ఆరుతడి పంటలే వేస్తారు. వీటికీ కాస్తాకూస్తో నీళ్లు అవసరం. వంశధార పరివాహక ప్రాంతంలో అధిక శాతం ఖరీఫ్ కోతలు పూర్తయ్యాయి. రైతులు వేరుశనగ, పెసలు, మినుములు, ఉలవలు వంటి పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వరికి నీళ్లు ఇవ్వలేమని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. గొట్టాబ్యారేజీ వద్ద ఉన్న ప్రస్తుత నీటి నిల్వల పరిస్థితి చూస్తే ఆరుతడి పంటలకూ నీళ్లు ఇచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

అపరాల సాగుపై ప్రభావం

నవంబరులో వర్షాలు పెద్దగా లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నేలలో తేమ శాతం తక్కువగా ఉండడంతో మినుము, పెసర పంటలను వేయలేకపోయారు. రబీలో పెసర సాధారణ సాగు 46,645 ఎకరాలు ఉండగా, ఇప్పటివరకు 765 ఎకరాల్లో సాగయింది. మినుము సాధారణంగా 70,340 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 1152.5 ఎకరాల్లో వేశారు. ఉలవలను 3,220 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 70 ఎకరాల్లో వేశారు. కట్టె జనుమును 2,270 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 207.5 ఎకరాల్లో వేశారు. వర్షాలు లేకపోవడం, వంశధార, నాగావళిలో నీటి ప్రవాహం జీరో లెవల్స్‌కు పడిపోవడంతో పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

రిజర్వాయర్లలో అడుగంటిన నీటి నిల్వలు

మునుపెన్నడూ లేని విధంగా వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం జీరో లెవల్స్‌కు పడిపోయాయి. ఒడిశాలోనూ వర్షాలు లేకపోవడంతో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా నవంబరులో వంశధారలో నాలుగు వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో ఉంటుంది. ప్రస్తుతం 500 క్యూసెక్కులకు మించి నీటి ప్రవాహం రావడం లేదు. నాగావళిలో ఈ సీజన్‌లో మూడు వేల క్యూసెక్కుల నీరు ప్రవహించేది. ప్రస్తుతం నీటి ప్రవాహం జీరోకు పడిపోయింది. ఖరీఫ్ చివరిలో పంటలు ఎండిపోతుండడంతో తోటపల్లి, మడ్డువలస నుంచి నీటిని విడిచిపెట్టి పంటలను కాపాడారు. గొట్టాబ్యారేజీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా ప్రస్తుతం 0.47 టిఎంసిలకు పడిపోయింది. అదేవిధంగా మడ్డువలస రిజర్వాయర్ సామర్థ్యం 3.37 టిఎంసిలు కాగా 1.05 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో రబీలో ఆరుతడి పంటలకూ నీరు ఇచ్చే అవకాశం కనిపించడం లేదు.



సమావేశంలో మాట్లాడుతున్న తులసీదాస్

జీడికి గిట్టుబాటు ధర ప్రకటించాలి

- ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- కరువు జిల్లాగా ప్రకటించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల గిట్టుబాటు ధర ప్రకటించి, రైతుభరోసా కేంద్రాల ద్వారానే కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పలాస పర్యటనలో ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ డిమాండ్ చేశారు. నగరంలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. గిట్టుబాటు ధర లేక జీడి రైతులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీడి రైతుల పక్షాన ఉంటుందా? దళారుల పక్షాన ఉంటుందో తెలపాలన్నారు. మద్దతు ధర కోసం జీడి రైతులు గతేడాది నుంచి పలురూపాల్లో పోరాటాలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కేరళ తరహాలో జీడి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నేరడి బ్యారేజీ నిర్మించి వంశధార, బాహుదా నదుల అనుసంధానం చేయాలన్నారు. వంశధార కాలువ మరమ్మతులు చేసి షట్టర్లు బిగించి శివారు భూములకు నీరు అందించాలని, ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. వంశధార నదిలో మన వాటా నీటిని ఉపయోగించుకుంటే జిల్లా సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. జిల్లా కరువు బారిన పడదని, వలసలను నివారించవచ్చని, ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందని తెలిపారు. రిమ్స్ హాస్పిటల్‌లో సూపర్ స్పెషాల్టీ వైద్యం అందక ప్రమాదాలు సంభవిస్తే నేటికీ విశాఖపట్నం తరలించాల్సి వస్తుందన్నారు. రిమ్స్‌ని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధి కోసం సర్వం త్యాగం చేసిన వంశధార నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలో చిన్న వర్షం కురిసినా నదిలా మారిపోతుందని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటిడిఎను ఏర్పాటు చేయాలని, గిరిజన భూములకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లాలో వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రిని నిర్మించాలని, కరువు జిల్లాగా ప్రకటించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విశ్వసముద్ర సంస్థకు ఇచ్చిన మైనింగ్ లీజును రద్దు చేయాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు అంతం తప్పదు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు
- మూడు నెలల తర్వాత ప్రజా ప్రభుత్వం
- జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, సరుబుజ్జిలి



కరపత్రాన్ని అందిస్తున్న కూన రవికుమార్

వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు అంతం తప్పదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో, సరుబుజ్జిలి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. కిష్టుపురంలో అచ్చెన్నాయుడు, సరుబుజ్జిలిలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరిట ప్రజలపై ప్రభుత్వం భారాలు మోపిందని విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహించడంతో సాగునీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకొస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని చెప్పారు. నిరుద్యోగులకు యువగళం నిధి పథకం కింద నెలకు రూ.మూడు వేలు, మహిళలకు దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఇస్తామన్నారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది చదువుకున్న పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతులకు అన్నదాత పథకం కింద సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామన్నారు. మహాశక్తి పథకం కింద 18 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 చెల్లిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని, రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయిన రమేష్, కింజరాపు హరిప్రసాద్, వెలమల విజయలక్ష్మి, టి.రామకృష్ణ, శివ్వాల సూర్యం, ఎ.రాంబాబు, పి.మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు దృష్టిసారించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న టైపిస్టుల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపాలని టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పి.మణిప్రభ డిమాండ్ చేశారు. రాష్ట్ర టైపిస్ట్‌లు, స్టెనోగ్రాఫర్ల సంఘం శ్రీకాకుళం డివిజన్ సమావేశాన్ని శ్రీకాకుళం ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జిఒ నంబరు 69ని విడుదల చేసి టైపిస్టుల సమస్యలకు పరిష్కారం చూపిందని, జిల్లాస్థాయిలో మాత్రం టైపిస్టుల సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. జిఒ విడుదల చేసినా తిరిగి ప్రభుత్వం నుంచి క్లారిఫికేషన్ కోసం లేఖ రాయడం సరికాదన్నారు. నేటికీ టైపిస్టులు రెగ్యులర్ కాక, ప్రొబేషన్ పూర్తి కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టైపిస్టు నియమాకాల్లో కారుణ్య నియామకాలు, బ్యాక్‌ల్యాగ్, గ్రూప్-4 ద్వారా భర్తీ చేయాలన్నారు. జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటరామన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రైతులపై కక్షసాధింపు

భూసేకరణ పరిధిలోకి రాని 50 సెంట్ల పంట పొలం ధ్వంసం

ప్రజాశక్తి - టెక్కలి

మూలపేట అదానీ పోర్టు రోడ్డు నిర్మాణ భూసేకరణలో రెవెన్యూ అధికారుల తీరుపై కోర్టును ఆశ్రయించిన బన్నువాడకు చెందిన ఇద్దరు రైతుల పంట భూములను రాత్రికి రాత్రే అధికారులు బుల్డోజరుతో ధ్వంసం చేశారు. పోర్టు రోడ్డు నిర్మాణంలో భాగంగా బన్నువాడ, తలగాం, వేములాడకు చెందిన రైతుల నుంచి అధికారులు భూసేకరణ చేపట్టారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారుల తీరుపై కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారు. ఇందుకు బన్నువాడకు చెందిన కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు పోలాకి ప్రసాదరావు, వట్టికూళ్ల కీర్తికుమార్ కారణమని రెవెన్యూ అధికారులు భావించారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా శనివారం రాత్రి బుల్డోజరుతో కీర్తికుమార్‌కు చెందిన 1.10 ఎకరాలు, ప్రసాదరావుకి చెందిన 79 ఎకరాల అపరాల పంటను ధ్వంసం చేశారు. భూసేకరణలో కీర్తికుమార్‌ది 60 సెంట్లు సేకరించగా, అదనంగా మరో 50 సెంట్ల పంటను ధ్వంసం చేశారు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ భూములకు సంబంధించిన నష్టపరిహారం శుక్రవారం జమ కావడంతో భూములను చదును చేసినట్లు అధికారులు చెప్తున్నారు. కీర్తికుమార్‌కు చెందిన భూసేకరణ పరిధిలోకి రాని 50 సెంట్లను ధ్వంసం చేయడంపై తహశీల్దార్ ప్రవల్లికను వివరణ కోరగా, తనకేం తెలీదని చెప్పారు. కక్షసాధింపుతోనే అధికారులు పంటలను ధ్వంసం చేశారని రైతులు మండిపడుతున్నారు.



చదును చేసిన పంట పొలం

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-23ను రద్దు చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షులు డి.రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని గాంధీపార్కులోని గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌లో పొందుపరిచిన సెక్షన్ 37, 38, కొన్ని ప్రావిజన్లలో పేర్కొన్న అంశాలు ప్రజలకు, న్యాయవాదులకు గొడ్డలిపెట్టు వంటిదన్నారు. సివిల్ కోర్టుల పరిధి నుంచి పూర్తిగా లిటిగేషన్‌ను తప్పించి, ప్రభుత్వమే ఒక ప్రత్యేక అధికారి ట్రిబ్యునల్‌ను నియమించి లిటిగెంట్ పబ్లిక్ ఆస్తిపై హక్కులను పరిష్కరించి తీర్పు వెలువరించే అధికారం ఇచ్చిందన్నారు. ఆ అధికారి ఇచ్చే తీర్పుపై స్థానిక సివిల్ కోర్టులకు కాకుండా హైకోర్టుకు మాత్రమే అధికారం ఉంటుందన్నారు. అధికారుల చేతుల్లోకి వెళ్లడం ద్వారా రాజకీయ ఒత్తిళ్లకు లొంగే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐలు నాయకులు పైడి లక్ష్మీపతి, డి.ఈశ్వరరావు, వెంకటేశ్వర్లు, సాయి కిషోర్, విజయలక్ష్మి, ఇంద్ర నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి న్యాయవాదులు విధుల బహిష్కరణ

ఎపి టైట్లింగ్ యాక్ట్-23ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు న్యాయవాదులు విధులను బహిష్కరిస్తున్న బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్ని సూర్యారావు, పొన్నాడ రాము తెలిపారు.



చెక్కును అందజేస్తున్న మనోహర్

ఒక్క ఓటూ చీలకూడదు

- వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యం
- జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ మనోహర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఒక్క ఓటూ చీలకుండా జనసేన, టిడిపి నాయకులు కలిసి పనిచేయాలని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం జనసైన్యం కంకణం కట్టుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో గ్రామ గ్రామాన కష్టపడి టిడిపి, జనసేన నాయకులను గెలిపించుకోవాలని సూచించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిదిసార్లు పంటలు నష్టపోయాయని, రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఉద్యోగం కానీ, ఒక్క పరిశ్రమ గానీ రాలేదన్నారు. సరదాగా బటన్ నొక్కడం తప్ప ఈ ప్రభుత్వంతో ఒరిగిందేం లేదని విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలను ఎంతగా హింసించారో గమనించాలన్నారు. పాల వెల్లువ పేరుతో మూడు లక్షలకు పైగా బర్రెలు కొన్నామని చెప్తున్న ప్రభుత్వం, వాటిని ఎక్కడ ఉంచిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాలు రాజ్యాంగ విరుద్ధమని కాగ్ నివేదిక ఇచ్చిందన్నారు. సర్పంచ్‌లకు గ్రామ సచివాలయాలను అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నా పట్టించుకోకుండా పెడచెవిన పెడుతున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో అద్భుతమైన వనరులు, ఇతర సౌకర్యాలు ఉన్నా పారిశ్రామికంగా ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. మత్స్యకారులు గుజరాత్‌కు వలస పోవాల్సిన దుస్థితి కల్పించారన్నారు. అలాంటప్పుడు ఇక్కడి నేతలకు పదవులు ఎందుకని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో తీసుకొస్తామని పవన్ కళ్యాణ్ చెప్పారని గుర్తుచేశారు. రాజకీయాల్లో పల్లకి మోసే బోయిలుగా కార్యకర్తలను విస్మరించే సంస్కృతి జనసేన పార్టీలో ఉండదని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన నలుగురు జన సైనికుల కుటుంబాలకు పార్టీ తరపున ఆర్థికసాయం అందజేశారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చి చెక్కులను అందజేశారు. సమావేశంలో జనసేన నాయకులు కోరాడ సర్వేశ్వరరావు, విశ్వక్‌సేన్, గేదెల చైతన్య, హనుమంతు కిరణ్‌కుమార్, ఎన్ని రాజు, పేడాడ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

21న చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఈనెల 21న చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొంటి గిరిధర్, కుప్పిలి కామేశ్వరరావు తెలిపారు. నగరంలోని జెవివి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో చెకుముకి హైస్కూల్ స్థాయి సైన్స్ సంబరాలు 380 పాఠశాలల్లో నిర్వహించగా, 22 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. రెండో స్థాయిలో మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను 21న నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ సంబరాల్లో 380 టీమ్‌లు, 1140 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. మూడో స్థాయి జిల్లాస్థాయి చెకుముకి సైన్సు సంబరాలను జనవరి 7న శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 77 టీమ్‌లు, 231 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. నాలుగో స్థాయిలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఫిబ్రవరి 10, 12 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు కుర్మారావు, చెకుముకి జిల్లా కన్వీనర్ ఎస్.సాయి శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం ప్రజలకు వంశధార నీరు

- వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు పనులు పూర్తి
- ఈనెల 15న సిఎం చేతుల మీదుగా ప్రారంభం
- ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ టి.శ్రీనివాస ప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న ఉద్దాన ప్రాంత ప్రజలకు వంశధార నీరు అందించనున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం సూపరింటెండెంట్ ఇంజినీరు టి.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. సుమారు రూ.700 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు పనులు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. ఈనెల 15న సిఎం జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా కంచిలి మండలం మకరాంపురం వద్ద ప్రారంభించడానికి సిద్ధం చేశామని చెప్పారు. పలు అంశాలను ప్రజాశక్తి ముఖాముఖిలో వెల్లడించారు.


ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు పనులు ఏ దశలో ఉన్నాయి?

పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లోని ప్రజలకు వంశధార నది నుంచి స్వచ్ఛమైన తాగునీటిని అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రాజెక్టును మంజూరు చేసింది. ఒక్కొక్కరికి రోజుకు వంద లీటర్లు చొప్పున నీటిని సరఫరా చేయాలన్నదే ఈ ప్రాజెక్టు లక్ష్యం. 2051 నాటికి ఆయా మండలాల జనాభా 7.82 లక్షలకు చేరుతుందని అంచనా వేసి అప్పటివరకు ప్రజల అవసరాలు తీర్చగలిగే సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశాం.

ఈ ప్రాజెక్టు పరిధిలో ఎంతమేర పైపులైన్లు ఏర్పాటు చేశారు?



వంశధార ప్రాజెక్టు నుంచి ఇచ్ఛాపురం వరకు పైపులైన్ ద్వారా తాగునీటిని సరఫరా చేయాలన్నదే ఈ ప్రాజెక్టు లక్ష్యం. మొత్తం 264 పెద్ద ట్యాంకులు, 999 కిలోమీటర్ల మేర పైపులైన్లు అనుసంధానించాం. గ్రామానికి ఒకటి చొప్పున చిన్నవి నిర్మించి ఇంటింటికి తాగునీరు అందించనున్నాం. ప్రధాన పైపులైను 350 కిలోమీటర్లు, డిస్ట్రిబ్యూటరీ లైన్లు 649 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేశాం. స్వల్పంగా ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత ఏడాదికి 1.12 టిఎంసిల నీరు ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఉపయోగించుకోవచ్చు. నీటి సరఫరాకు వీలుగా 16 ప్రదేశాల్లో ఓవర్‌హెడ్ బ్యాలన్సింగ్ రిజర్వాయర్లు, 23 ప్రదేశాల్లో గ్రౌండ్ లెవల్ బ్యాలన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించాం. మెళియాపుట్టి మండలం మాకన్నపురం, పలాస మండలం టెక్కలిపట్నం వద్ద హెడ్ వర్కులు పూర్తి చేసి పైప లైన్ల ద్వారా 51 సంపులకు నీరందించనున్నాం.



ఈ ప్రాజెక్టు ద్వారా ఎన్ని మండలాలకు నీరందిస్తున్నారు?

హిరమండలం రిజర్వాయర్ వద్ద ఇంటేక్ వెల్ నిర్మించి అక్కడ నుంచి పైపులైను ద్వారా వజ్రపుకొత్తూరు మండలంలో 121 గ్రామాలు, పలాసలో 86 గ్రామాలు, మందసలో 225 గ్రామాలు, సోంపేటలో 74 గ్రామాలు, కవిటిలో 118 గ్రామాలు, కంచిలిలో 138 గ్రామాలు, ఇచ్ఛాపురంలో 45 గ్రామాలకు తాగునీరు అందించనున్నాం. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని ఏడు మండలాల పరిధిలో 807 గ్రామాల్లోని 4.69 లక్షల జనాభా తాగునీటి అవసరాలు తీరనున్నాయి.



సత్యాగ్రహ దీక్ష చేస్తున్న బాధితులు

అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం అగ్రిగోల్డ్ కంపెనీ నుంచి డబ్బులు వసూలు చేసి బాధితులకు డబ్బులు చెల్లించాలని అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.జయసింహ, మహిళా రాష్ట్ర కార్యదర్శి ఆరేలమ్మ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలో భాగంగా కాశీబుగ్గ గాంధీ విగ్రహం సిపిఐ ఆధ్వర్యాన బాధితులు ప్లకార్డులు చేతబట్టి ఆదివారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ముందుగా ఈ దీక్షను సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం చేపట్టిన వారం రోజుల్లో బాధితులకు నష్టపరిహారం ఇప్పిస్తామని సిఎం జగన్ చేపట్టిన పాదయాత్రలో హామీనిచ్చారని గుర్తు చేశారు. మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.పది లక్షలు చొప్పున చెల్లిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ పాత్రో, శ్రీనివాస్‌పాత్రో, వామపక్ష నాయకులు చాపర సుందర్‌లాల్, వి.మాధవరావు, దున్న శ్రీనివాస్, తెప్పల అజయ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివాజీ

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం

మాజీ మంత్రి గౌతు శివాజీ

ప్రజాశక్తి- సోంపేట

ఐకమత్యంగా ఉంటేనే ఏ సామాజిక తరగతైనా అభివృద్ధి సాధిస్తుందని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. పట్టణ శ్రీశయన సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం సమీపంలోని ఓ తోటలో నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సహాయం అందాలంటే రాజకీయంగా కూడా గుర్తింపు తెచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇందులో భాగంగా చిన్నారులచే ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జెడ్‌పిటిసి యశోద, శ్రీశయన సంఘం అధ్యక్షులు రెల్లి నారాయణ, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్, సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోడ అప్పారావు, జిల్లా సంఘ అధ్యక్షుడు లోట్ల దీనబంధు, జోగారావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా కిషోర్ కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



కిషోర్ కుమార్

ఏలూరులో నిర్వహించిన యుటిఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా సంపతిరావు కిషోర్ కుమార్ ఎన్నికయ్యారు. ఆయన శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యాయ ఉద్యమంలో గత రెండు దశాబ్దాలుగా పనిచేస్తూ మండల కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఉపాధ్యాయ ఉద్యమాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు చౌదరి రవీంద్ర, ఆర్.దమయంతిలను ఎన్నికయ్యారు.

రహదారి గోతులమయం

- ఇక్కట్లు పడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న పాలకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని పురుషోత్తపురం వెళ్లే రహదారి గోతుల మయంగా మారి ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. పాలకులు, అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని ప్రభుత్వం పలుమార్లు చెబుతునే ఉంది. కానీ, మాటలకే పరిమితం అయ్యిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు కిలోమీటర్ల రహదారి అత్యంత దారుణ పరిస్థితిలో ఉందని, తరచూ ప్రమాదాలూ జరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెవ్వాకులపేట వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయడంతో అక్కడి నుంచి రోజూ వందల కొద్దీ లారీలు ఇసుకను తరలిస్తుండడంతో రహదారి గోతుల మయంగా మారిపోయింది. రోడ్డులో గజానికో గుంతగా మారి రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే



గోతులమయమైన పురుషోత్తపురం- రామచంద్రపురం రోడ్డు

భయపడుతున్నారని, రాళ్లు తేలిన మరమ్మతులకు గురై సకాలంలో రహదారిపై రోజూ ప్రయాణిస్తుంటే సైకిళ్లు పాఠశాలలకు చేరుకోలేకపోతున్నామని వాపోతున్నారు. పొన్నాంపేట, పొన్నాంపేట కాలనీ, రామచంద్రాపురం, చిట్టీవలస, చెవ్వాకులపేట, అలమాజీపేట తదితర 8 గ్రామాల ప్రజలు రహదారి లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

గతేడాది రోడ్లు, భవనాల శాఖ అధికారులు రహదారికి ప్యాచ్ వర్క్‌లు చేసి మమ అనిపించేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మించి ఎనిమిదేళ్లు కావస్తుందని, కానీ, నేటికీ శాశ్వత రహదారికి నోచుకోలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రజలు పడుతున్న కష్టాలను గ్రహించి నూతన రహదారిని నిర్మించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



రహదారి గోతులమయంగా మారడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కొన్నేళ్లుగా రహదారి పాడై చిన్న చిన్న గుంతలుగా మారింది. ప్రభుత్వం చెవ్వాకులపేట వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేయడంతో అధిక సంఖ్యలో లారీలు తిరుగుతున్నాయి. దీంతో రోడ్డు గోతులమయమైంది. ప్రభుత్వం ఆదాయం చూసుకుంటుంది తప్ప తమ ఇబ్బందులను పట్టించుకోవడం లేదు.

- చల్ల ఎర్రప్పడు, పొన్నాంపేట

పాలకులు స్పందించాలి



రహదారి పాడై రెండేళ్లు అవుతుంది. కానీ, పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డులో పెద్ద పెద్ద గోతులమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది చిన్న చిన్న మరమ్మలు చేపట్టి మమ అనిపించేశారు. తరువాత రహదారి షరా మామూలుగా తయారైంది. విద్యార్థినీ విద్యార్థులు పట్టణంలోని పాఠశాలలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. తరుచూ సైకిళ్లు మరమ్మతులకు గురవుతున్నాయి. పాలకులు స్పందించి నూతన రోడ్డును నిర్మించాలి.

- ఇప్పిలి శేషగిరి, పొన్నాంపేట

వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు చందు



మాట్లాడుతున్న చందు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు మెరుగు పర్చాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా ఉపాధ్యక్షులు డి.చందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ శ్రీకాకుళం నగర శాఖ మహాసభలు ప్రైవేటు పంక్షన్ హాల్లో జరిగాయి. మహాసభల్లో ఆయన హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వరంగ విద్యను పేదలకు అందకుండా చేస్తోందన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచి సకాలంలో నిధులు విడుదల చేయాలని, లేని పక్షంలో విద్యార్థులు అర్ధాకలితో అలమటించే పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు. విద్యారంగంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అధ్యాపకుల సంఖ్యను పెంచాలన్నారు. సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు తరగతి గదులకు పరిమితమయ్యే ఆన్‌లైన్ విద్యకు బదులుగా ఉపాధ్యాయ బోధన అందించాలన్నారు. ఈ మహాసభల్లో నూతన నగర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా తిరుపతి, అమ్మాజీరావు, గర్ల్స్ కన్వీనర్ రేవతి, పవిత్ర, కమిటీసభ్యులుగా సీతమ్మ, దివ్య చాందిని, మణి, రాజు, అనంత్, లక్ష్మణ్, అప్పలరాజు, నితిన్, తరుణ్, భూపతి, భరణిలతో పాటు 19మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు సంతోష్ పాల్గొన్నారు.



విగ్రహాల వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రముఖులు

'సత్తారు' విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి

సమాస సేవ చేసే వారికి జనంలో గుర్తింపుని తీసుకొస్తాయని, అటువంటి మనస్తత్వం కలిగిన వ్యక్తులు ఎప్పుడూ ఆదర్శప్రాయులని విశాఖపట్నానికి చెందిన క్రాంతి పిక్చర్స్ అధినేత నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. స్థానిక సుదర్శన థియేటర్ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే సత్తారు లోకనాథం నాయుడు, అన్నపూర్ణమ్మల విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించారు. రాజకీయాల్లో పలు పదవులు అలంకరించి టెక్కలి పట్టణ అభివృద్ధిలో లోకనాథం నాయుడు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో లోకనాథం నాయుడు కుమారుడు, థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ, సుధారాణి, విశాఖ డెయిరీ మేనేజర్ చాపర విజయారావు, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల అధినేత బివిఎస్ఎన్ మూర్తి, చింతాడ గణపతి, సత్తారు సత్యం, సత్తారు ఉషారాణి, చింతాడ పార్వతీశం, వాకాడ నారాయణరావు, పొన్నాన జగన్మోహనరావు, తమ్మనగారి కిరణ్‌కుమార్, థియేటర్ మేనేజర్ బాలకృష్ణ, రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వే స్టేషన్‌కు కిలో మీటరు దూరంలో ఆదివారం భువనేశ్వర్ వెళ్లే రైలు కింద పడి 33 ఏళ్ల వయసు కలిగిన మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ షరీష్ తెలిపారు. ఈమె వద్ద ఉన్న గుర్తింపు కార్డు ప్రకారం రాణికుమారిగా అనుమానిస్తున్నారు. డిఫెన్స్ ఉద్యోగిని భార్యగా గుర్తింపు కార్డు ఉందని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. రైలు ఢీకొనడంతో ఆమె శరీరం ఛిద్రమైందని, నుదుటి భాగం పూర్తిగా దెబ్బతిందని అన్నారు. చేతులు రైలు కింద పడి నుజ్జయ్యిందన్నారు. రైల్వే సిబ్బంది అతికష్టం మీద ఆమె శరీరాన్ని బయటకు తీసుకొచ్చారు. ఈమెకు సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.



పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- పోలాకి

ద్విచక్ర వాహనాలకు నంబరు ప్లేట్లు తప్పనసరిగా ఉండాలని, అలాగే సంబంధిత పత్రాలు ఉంచుకోవాలని ఎస్ఐ వి.సత్యనారాయణ వాహనదారులకు సూచించారు. పోలాకిలో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు, లైసెన్సులు, నంబరు ప్లేట్లను పరిశీలించారు. అనంతరం వాహనదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదు, ఇద్దరుకు మించి ద్విచక్ర వాహనంపై వెళ్లరాదని సూచించారు. లైసెన్స్, సీబుక్, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం రాజారాంపురం సముద్ర తీరంలో పిక్నిక్ సందర్భంగా ఏర్పాటు చేసిన భద్రత సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



కేరింతలు కొడుతున్న యువకులు

సముద్ర తీరంలో పిక్నిక్ సందడి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని తీరప్రాంత గ్రామాలైన భావనపాడు, మేఘవరం, సున్నాపల్లి తీరాల్లో ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది. పరిసర మండలాల నుంచి యువకులు, మహిళలు, చిన్నారులు సముద్ర తీరానికి చేరుకుని కేరింతలు కొట్టారు. ముందుగా సమీపంలోని తోటల్లో భోజనాలు చేసి సాయంత్రం సముద్ర స్నానాలు చేశారు. దీంతో భావనపాడు తీరం కిటలాడింది. డిజె పాటలకు నృత్యం చేస్తూ... సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నౌపడ పోలీసులు, భావనపాడు మెరైన్ పోలీసులు సంయుక్తంగా పహారా కాశారు. ప్రమాద హెచ్చరికలు సూచిస్తూ అవగాహన కల్పించారు.

ఈశ్వరరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి- కవిటి



ఈశ్వరరావు

సోంపేట పట్టణానికి చెందిన తట్ట ఈశ్వరరావు కేరళ కేంద్ర విశ్వ విద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జీనమిక్స్ విభాగంలో డాక్టరేట్ పొందారు. రీసెర్చ్ సూపర్ వైజర్ డాక్టర్ రంజిత్ కుమార్ పర్యవేక్షణలో 'ఎ సినార్జిస్టిక్ స్టడీస్ ఆఫ్ రోడెత్రిన్ అండ్ క్లోరాం ఫెనికాల్ ఆన్ ది బైయోఫిల్మ్ ఆర్క్ టెక్చర్, యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ అండ్ క్వారం సెన్సింగ్ ఎగైనిస్ట్ ఎంటరోకొకస్ ఫేకాలస్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఇందుకుగాను ఈ డాక్టరేట్ పొందారు. అంతేకాకుండా సుమారు పది అంతర్జాతీయ జర్నల్స్‌లో తన పరిశోధనలపై కథనాలు రాసినట్టు ఈశ్వరరావు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న మనోజ్

మనోజ్‌కు 'దాసరి' అవార్డు

పలాస : జానపద కళాకారుడు పలాస-కాశీబుగ్గ మున్సిపాలికి చెందిన మనోజ్‌కు దాసరి నారాయణ రావు అవార్డును అందుకున్నారు. విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో కల్చర్ అకాడమీ అనుబంధ సంస్థ విశాఖరత్న కళా పరిషత్ 25వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి అవార్డును అందించారు. సంస్థ వ్యవస్థాపకులు పి.ఎ.భాస్కరరావు, కె.ఉపేంద్ర, జానపద పరిశోధకులు బద్రి కూర్మారావు, సినీనటులు కుమార్‌నాయక్, రఘు, బొత్స సందీప్, ఎఎస్‌పి శ్రీనాథ్‌లు అవార్డును అందించారు.



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల పయనం

ప్రజాశక్తి- బూర్జ

మండలం కె.కె.రాజపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు గత నెల 29న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన పరుగుపందెం పోటీల్లో ఎస్.తులసి మూడు కిలోమీటర్ల పోటీలో ప్రథమ స్థానం సాధించగా, ఎస్.మాధురి 200 మీటర్ల పరుగుపందెంలో ప్రథమస్థానం సంపాదించి రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు ఎంపికవ్వడంతో ఈనెల 12, 13, 14 తేదీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రధానోపాధ్యాయులు వై.మాలతి ఆధ్వర్యంలో ఆదివారం బయలుదేరారు. వీరితో పాటు ఈద అప్పన్న ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- పలాస



మాట్లాడుతున్న ప్రకాశరావు, బాలకృష్ణ

మిచౌంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వాలు బాధిత రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు, జిల్లా కమిటీ నాయకులు గొరకల బాలకృష్ణ డిమాండ్ చేశారు. మందస మండలం హరిపురం మార్పు గ్రంథాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు.

అతివృష్టి, అనావృష్టి రెండూ సంభవించి రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను ప్రభుత్వాలు ముందే అంచనా వేసి సరైన చర్యలు తీసుకో వడంలో విఫలమ య్యాయని విమర్శిం చారు. తడిచిన, రంగుమారిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలన్నారు. రబీకి ఉచితంగా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని కోరారు. ఉచితంగా బియ్యం, పప్పులు, నిత్యవసర సరుకులను అందించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు

ప్రజాశక్తి- రణస్థలం

మండలం కోష్ట పంచాయతీ పైడిపేటలో పైడి లక్ష్మి అనే మహిళా రైతుకు చెందిన 0.15 సెంట్లులో కూరగాయల పంటలతో ఎటిఎం మోడల్ ఆదివారం వేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కృష్ణ మాట్లాడుతూ ఎటిఎం మోడల్‌లో ఒక బెడ్ వెడల్పు నాలుగు అడుగులు మధ్యలో ఒక అడుగు కాలువ ఏర్పాటు చేసుకొని ఈ విధంగా ఏర్పాటు చేసుకున్న బెడ్డపై దుంప జాతి ముల్లంగి, క్యారెట్, బీట్రూట్, కాయగూరలైన వంగ, టమోటా, బెండ, చిక్కుడు, మిరప, ఆకుకూరలైన తోటకూర, గోంగూర, జొన్న, సజ్జ తదితర పంటలు నిర్ణీత కొలతల ప్రకారం వేసుకుంటే 365 రోజులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో నిరంతరం కూరగాయలు దిగుబడిని పొందవచ్చునని రైతులకు సూచించారు. నేలను 365 రోజులు కప్పి ఉంచవచ్చునని, ఇలా చేయడం వలన పౌష్టికాహారంతో పాటు మంచి నేలలు కూడా తయారై చీడపీడల యాజమాన్యం సులువుగా చేసుకోవచ్చునన్నారు. ఈ విధంగా మోడల్స్ వేయడం వలన తక్కువ ప్రదేశంలో ఎక్కువ ఆదాయం, ఎక్కువ రకాల పంటలు పండించుకోవచ్చనన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి కొయ్యాన రాంబాబు, డిజిటల్ కార్యకర్త శివ శంకర్, ప్రకృతి వ్యవసాయ గ్రామకార్యకర్తలు పిసిని సంతోషి, ప్రమీల, భారతి, సురేష్ కుమార్, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కృష్ణ

వైద్య శిబిరాలకు స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజు

ఎల్ఎన్‌పేట : మండలంలోని శ్యామలాపురంలో శ్రీకాకుళం సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రాజు 200 మంది రోగులకు సుగర్, బిపి తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తరచూ సుగర్, బిపి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. వేడి నీరు, ఆహారం తీసుకోవాలన్నారు.

పొందూరు: మండలం తోలాపి శ్రీసత్యసాయి మందిరంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 450 మందికి గుండె, కీళ్లనొప్పులు, కంటి సమస్యలతో పాటు ఇసిజి, 2డి, ఇ-కో వంటి పలు రకాల పరీక్షలను జరిపి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డా.దయానంద్, డా.సతీష్‌కుమార్, డా.అమృత, డా.సుధాకర్, మణికంఠ, మేనేజర్ సింహాచలం, సాయిచంద్రశేఖర్, సత్యసాయి మందిర కన్వీనర్, సేవాదల్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు



లావేరు : పరామరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

మండల కేంద్రం వస్త్రపురికాలనీకి చెందిన లావేరు సచివాలయం-1 కన్వీనర్ తోట అప్పలరాజు ఇటీవల రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఆస్పత్రిలో వైద్యం పొంది ఇటీవల ఇంటికి చేరుకున్న అప్పలరాజును ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆదివారం పరామర్శించారు. అనంతరం బుడుమూరుకు చెందిన మల్లా గోవిందమ్మకు ఇటీవల ప్రమాదంలో కాలుకు గాయాలు కావడంతో ఎమ్మెల్యే ఆమెను పరామర్శించారు. ఈయనతో పాటు జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసురావు, ఎంపిటిసి యినపకుర్తి సతీష్, లంకలపల్లి నారాయణరావు, లావేరు ఉపసర్పంచ్ పైడి దాము, బుడుమూరు ఎంపిటిసి బొడ్డ రవిబాబు, కింతలి కోటి ఉన్నారు.

రణస్థలం రూరల్: మండలం రావాడ గ్రామంలో వైసిపి కార్యకర్త లెంక సన్యాసప్పడు అనారోగ్యం శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయనతో పాటు ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొర్లె శ్రీనువాసరావు, రావాడ ఎంపిటీసి ప్రతినిధి కిల్లారి సూర్యనారాయణ, వైసిపి నాయకులు గొర్లె రవి, లెంక పాపారావు, లెంక రాము, లెంక రమణ, రెడ్డి అసిరి నాయుడు, పతివాడ సీతం నాయుడు ఉన్నారు.

రేపు సిజిఆర్ఎఫ్ వేదిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎపిఇపిడిసిఎల్ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న మంగళవారం పట్టణంలో సబ్‌డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) నిర్వహించనున్నట్లు విద్యుత్ ఆపరేషన్స్ ఇఇ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ జడ్జి, సిజిఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు సంబంధించి ఫిర్యాదులను ఈ వేదిక ద్వారా ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

జనసేనలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మనోహర్

ఇచ్ఛాపురం: జనసేన పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల మనోహర్ ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ మేరకు ఇచ్ఛాపురానికి చెందిన పలువురు జనసేనలోకి చేరారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు తెలిపారు. మున్సిపాలిటీలో 12,13,17 వార్డు, మండపల్లి, సోంపేటలోని గొల్లగండిలోని వైసిపి నాయకులు గండు పల్లి మిన్నారావు, గండుపల్లి జగదీశ్వరరావు, కర్రి నాగరాజు, తుపాకుల భోగేష్, ఆశి శేషారావు, చాట్ల శేషారావు, కొనతల త్రినాథ్‌రెడ్డి, కె.వాసు, పైల శ్రీను, అనపాన రమేష్, లండ రుక్మందర్‌రెడ్డి, నీలాపు ఉపేంద్ర, కొరికాన పకీర్ చేరారని అన్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రెటరీలు తిప్పన దుర్యోధనరెడ్డి, బైపల్లి ఈశ్వరరావు, మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలో వైసిపికి చెందిన గోకర్ణపురం సర్పంచ్ సేనాపతి రవికుమార్ జనసేన పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల చైతన్య, సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



అప్పలసూర్యనారాయణ

రాజకీయ నాయకులుగా ప్రజా జీవితంలో ఉన్న శాసనసభ్యులు, మంత్రులు శాసనసభ నియమావళికి లోబడి మాట్లాడాల్సి ఉంటుందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేరీతిలో వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడుతున్నారని మాజీమంత్రి గుండ అప్పల సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని అరసవల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒంగోలు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైసిపి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడే తీరు అభ్యంతరకరమన్నారు. మంత్రి హోదాలో డబ్బులు తీసుకున్నానని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని రూ.50 లక్షలకు బెట్టింగ్ కట్టానని బహిరంగంగా చెప్పడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. అవినీతి చేసినా, బెట్టింగ్‌లకు పాల్పడినా చట్టం పరిధిలో తామంతా మినహాయింపు పొందినట్టు తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపడమే అవుతుందన్నారు. ఇటు వంటి ప్రకట నలు చేసిన వ్యక్తులపై ఎసిబి ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు.

ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు పెట్టే ఎసిబి అధికారులు సుమోటోగా అతనిపై ఎందుకు కేసులు నమోదు చేయడంలేదన్నారు. అవినీతిపరుల విషయంలో ప్రజలు, చట్టాలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.



బహుమతులను అందజేస్తున్న కృష్ణమూర్తి

విజేతలకు బహుమతుల ప్రదానం

ఇచ్ఛాపురం: మానవ హక్కులపై విషయ పరిజ్ఞానం ఉంటే ప్రతి వ్యక్తీ ఉన్నతంగా ఏదగడానికి దోహదపడుతుందని ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ నవ్య అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మానవ హక్కుల ప్రెసిడెంట్ దక్కత కృష్ణమూర్తి అధ్యక్షతన ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యాసరచనలో విజేతగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పాఠ్యంశాలతో పాటు లోకజ్ఞానం నేర్చుకోవాలన్నారు. ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాజేంద్ర, ఎం.రాంబాబు, కె.రామారావు, కె.సి.పూరి, తులసీరావు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన భోజనాలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో తండ్యాం పంచాయతీ శ్రీరామనగర్‌కాలనీ సమీపంలో మాడుగుల తోటలో ఆదివారం ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమాన్ని ఎంతో సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పరిధిలో పలు గ్రామాలకు చెందిన ఖాదీ కార్మికులు, సంఘం ఉద్యోగులు ఆనందంగా గడిపారు. ఆట పాటల్లో పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో ఎఎఫ్‌కెకె సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వర ప్రసాద్, వెంకటరమణ, పలువురు సంఘం ఉద్యోగులు పాల్గొన్నారు.

బూర్జ : మండలం డొంకలపర్త పరిధి వై.పర్త గ్రామంలో నాగావళి తీరంలో తోటలో ఉసిరి చెట్టు వద్ద ఆదివారం గ్రామస్తులు ఘనంగా కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెయ్యి మందికి వన భోజనాలు పెద్దఎత్తున నిర్వాహకులు యందవ అప్పలనాయుడు, టంకాల అన్నంనాయుడు, యందవ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి లక్కుపురం, పనుకుపర్త తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వివిధ చోట్ల ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది.



పొందూరు : భోజనాలు వడ్డిస్తున్న ఉద్యోగులు

పోలాకి: దీర్ఘాశీ కాలనీ ఉమాసహిత రామలింగేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో కార్తీకమాసం సందర్భంగా ఆలయ కమిటీ నిర్వహకులు ఐదు వేల మందికి అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమం సర్పంచ్, ఎంపిటిసి, నిర్వాహకులు పిల్లి రాజు భవానీ పాల్గొన్నారు.

నేడు మంత్రి రజని పర్యటన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని ఈనెల 11వ తేదీన జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గం ద్వారా పలాసలోని పవర్‌గ్రిడ్ వసతిగృహానికి ఆదివారం రాత్రి చేరుకున్నారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు పలాసలోని వైఎస్ఆర్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రిని సందర్శిస్తారు. ఆస్పత్రిలోని విభాగాలను పరిశీలించిన అనంతరం అక్కడే విలేకరుల సమావేశంలో మాట్లాడుతారు. పర్యటన అనంతరం ఉదయం పది గంటలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్తారు.



పోస్టర్లను పంపిణీ చేస్తున్న లక్ష్మీదేవి

చంద్రబాబుతోనే భవిష్యత్‌కు గ్యారంటీ

శ్రీకాకుళం అర్బన్: చంద్రబాబుతోనే భవిష్యత్‌కు గ్యారంటీ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. ఆదివారం మండలం ఒప్పంగి పంచాయతీ శ్యామ్‌పాలెం గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, సర్పంచ్ అభ్యర్థి గొండు లక్ష్మి, గొండు శరత్, వార్డు మెంబరు దొండపాటి లక్ష్మి, బలగ నరసింహారావు, ముద్దాడ అప్పారావు, బలగ తాతారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని ఉప్పినివలస పంచాయతీ పరిధిలో జంగాలపేట గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు కరణం వాసుదేవరావు ఇంటింటికి వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి వార్డు మెంబర్లు, మహిళలు పాల్గొన్నారు.

శిష్టకరణాలను ఒబిసిలో చేర్చాలి

రణస్థలం: ఆర్థికంగా వెనుకబడిన శిష్టకరణాలను ఒబిసిలో చేర్చాలని రణస్థలం, లావేరు మండలాల శిష్టకరణ సంఘం గౌరవ సలహాదారు బలివాడ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రణస్థలం, లావేరు మండలాల శిష్టకరణ కార్తీక సమారాధన కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రంలో శిష్టకరణాలను బిసిలో చేర్చినా కేంద్ర సర్వీస్‌లకు ఒబిసి అనివార్యం అవుతోందన్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధులు కృషిచేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా రొంపిల్లి నాగరాజు, అధ్యక్షులుగా ఆర్.వి.రమణ, ఉపాధ్యక్షులుగా బలివాడ ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా కొట్టు శాంతారావు, ప్రధాన కార్యదర్శిగా కుప్పిలి జగదీష్ పాత్రో, ట్రెజరర్‌గా బలివాడ భద్ర, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



గ్లోబ్ ద్వారా విద్యార్థులకు వివరిస్తున్న సుశాంత్‌కుమార్

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

లావేరు: స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే జనరల్ నాలెడ్జ్ నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా లంకలపల్లి సుశాంత్ కుమార్ గ్లోబ్ ద్వారా ప్రపంచ దేశాలకు సంబంధించిన విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయం తరుపున బహుమతులు అందజేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై ఏర్పడిన గొయ్యి

ఆదమరిస్తే అంతే

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- స్పందించని ఆర్అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పెట్రోల్‌బంక్ సమీపంలో అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై కల్వర్టు కుంగిపోయి గొయ్యిగా మారింది. వాహనదారులు ఆదమరచి ప్రయాణం చేస్తే అంతే సంగతులు. ప్రమాద బారిన పడి దావాఖానాకు వెళ్లాల్సిందే. కల్వర్టు కుంగి నెలరోజులు కావస్తున్నప్పటికీ ఆర్అండ్‌బి శాఖాధికారులు ఇంతవరకు తొంగి చూడలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రాత్రిపూట కుంగిన ప్రదేశాన్ని గుర్తించలేక తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని పలువురు వాహనదారులు వాపోతున్నారు. గతంలో కూడా మండలంలోని షలంత్రి గ్రామం దగ్గర చెరువు వద్ద కల్వర్టు కుంగిపోతే అధికారులు స్పందించలేదని ఆ తరువాత భారీనష్టం జరిగాక వాహనాలను సరుబుజ్జిలి మీదుగా పాలకొండ రోడ్డు వైపు దారి మళ్లించి రాత్రికిరాత్రి పనులను అధికారులు చేపట్టారని పలువురు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా కల్వర్టు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించి ఆర్అండ్‌బి అధికారులు నిద్రమత్తు వదిలి మరమ్మతులు చేసి ప్రజలను ప్రమాదాల బారి నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బ్యాంకుల్లో పని చేస్తున్న మాజీ సైనికులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బదిలీ సౌకర్యం కల్పించాలని అఖిల భారత మాజీ సైనిక ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యదర్శి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో జిటిరోడ్‌లో ఉన్న మీన కృష్ణ ప్లాజాలో అఖిల భారత మాజీ సైనిక ఉద్యోగుల సమాఖ్య రిజిస్టర్డ్ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రాంతీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి గిరిధర్ నాయక్ అధ్యక్షత వహించారు. జిల్లాలో వివిధ బ్యాంకుల్లో పనిచేస్తున్న మాజీ సైనికులు 120 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాఖ్య ప్రాముఖ్యతను, ఇప్పటి వరకు జరిగిన పోరాటాలు, విజయాలు, ముందున్న సవాళ్లపై సభ్యులకు వివరించారు. మాజీ సైనికుల బ్యాంకు ఉద్యోగుల కోసం ప్రత్యేక బదిలీ విధానం రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి జి.కాంతారావు, సెంట్రల్ కమిటీ మెంబర్ ఎవిజి రాజు సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎం.మురళీ కృష్ణ, కె.మోహనరావు, బి.అప్పారావు, బిఎన్ ప్రతాప్, పి.నాగభూషణ్, కె.రమేష్, శ్రీధర నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మాజీ సైనికులు



విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న గౌరీ హరినాథ్

ఉన్నత చదువులు అభ్యసించాలి

లావేరు: ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకుని ఉన్నతవిద్యను అభ్యసించాలని ఉపాధ్యాయులు బాసిన గౌరీ హరినాథ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లావేరు, రణస్థలం, అప్పాపురం గ్రామాలకు చెందిన దేవాంగులు కార్తీకమాస వనమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా లావేరుకు చెందిన వైష్ణవిజ్యోత్స్న, ఆదిత్య త్రివేదులు నీట్, ఐఐటీలో సీట్లు సాధించిన సందర్భంగా సంఘ ప్రతినిధులు సన్మానించారు. అనంతరం విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున లావేరుకు చెందిన ఉపాధ్యాయులు బాసిన గౌరి హరినాధ్ నగదు బహుమతి అందించారు. అలాగే పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు నగదు అందించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజారావుకు జాతీయస్థాయి బహుమతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

అవినీతి వ్యతిరేక కవితల పోటీల్లో పట్టణానికి చెందిన రచయిత కె.వి.రాజారావుకు జాతీయస్థాయి బహుమతి వరించింది. గుంటూరు జిల్లాకు చెందిన అమరావతి సాహితీ మిత్రులు సంస్థ, ఆమ్‌ఆద్మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ సంయుక్తంగా నిర్వహించిన అవినీతి వ్యతిరేక కవితల పోటీల్లో రచయిత కె.వి.రాజారావు రచించిన ' గొంతు ప్రశ్నార్థమైతేనే' కవిత ఉత్తమ కవితగా ఎంపికైంది.. ఈ సందర్భంగా గుంటూరులో శనివారం నిర్వహించిన సాహిత్య సదస్సులో రాజారావుకు రూ.3వేలు నగదు, ప్రశంసాపత్రం, దుశ్శాలువతో జాతీయ స్థాయి బహుమతిని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రచయిత కెవి.రాజారావు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న అమరావతి సాహితీ మిత్రులు

గణిత ప్రతిభా పరీక్షకు స్పందన



విద్యార్థులతో నిర్వాహకులు

టెక్కలి : సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి ఎంపిక గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ మేరకు నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షకు 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రతిభా పరీక్ష ప్రశ్నపత్రాలను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఇటీవల మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారే ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరేష్, స్వర్ణలత, రుషి, భాస్కరరావు, విజయ్‌కుమార్, మురళీకృష్ణ పాల్గొన్నారు.



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో పిఎస్ఎన్ఎం హైస్కూల్‌లో 1980లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఆదివారం హోటల్ గ్రాండ్‌లో కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికను కేశిరెడ్డి వెంకటేష్, బందారు వెంకటరమణ, గురిజిల్లు రాధాకృష్ణ అందరి సహకారంతో ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు పలకరించుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులు శ్రీరాములు, మోహన్ నాయుడు, నవీన్ చంద్రుడు, హెచ్ఎం శంకరరావుకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నరసింగరావు, చిట్టి మోహన్, నాగపద్మ, మైథిలిరాణి పాల్గొన్నారు.

అరసవల్లి ఆదాయం రూ.10 లక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ పెరిగింది. దీంతో ఆదివారం ఒక్క రోజునే రూ.10.60 లక్షల ఆదాయం సమకూరింది. టికెట్లు విక్రయాల ద్వారా రూ.6,64,900, విరాళాల రూపంలో రూ.85, 912, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,10,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చంద్రరావు

రోడ్డు పనులకు శంకుస్థాపన

మెళియాపుట్టి : మండలంలోని బాణాపురం పంచాయతీ సవరగుమడ రోడ్డు పనులకు సర్పంచ్ పెద్దింటి చంద్రరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ చొరవ చూపి నిధుల మంజూరుకు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు బమ్మిడి కరుణాకర్, సెంగల్వరావు, పూర్ణచంద్రరావు, మల్లికార్జునరావు, కామేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 15న పలాస వస్తున్నారని, దీనిని విజయవంతం చేయాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పిలుపునిచ్చారు. మెప్మా కార్యాలయంలో ఆర్‌పిలు, సిఎల్ఆర్‌పిలతో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం బహిరంగ సభకు అధిక సంఖ్యలో మహిళలను తరలిరావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు